



# దూరపు కొండలు

## ॥ సింగరాజు రామచంద్రమూర్తి ॥

> "ఒక నగ్నసత్యాన్ని గుర్తించాను - పల్లెలు పట్నాలకేమీ తీసిపోవని" అన్నాడు

కాలేజీలో చదువుకునే రోజుల్లోనే వానికి బోలెడు ఆశయాలుండేవి. చిన్నతనం నుంచి బస్తీలో పెరిగినవాడవటంవలన పల్లెటూరు వాతావరణం ఎలా ఉంటుందోకూడా తెలియక పోయినప్పటికీ వారూ, వీరూ చెప్పిన మాటలు విని —పుస్తకాలలోనూ, కథల్లోనూ పల్లెపట్ల వర్ణనలు చదివి వాటిమీద మమకారం పెంచుకున్నాడు. ఎలాగయినా కొన్ని రోజులపాటు పల్లెల్లో గడపాలని, అమాయకులు, నిష్కల్మష హృదయులు అయిన వారి సౌభాగ్యానికి పాటు పడాలని, తను చదువుకున్నది వారికికూడా అందించి ఉడుతాభక్తిగా వారికి తోడ్పడాలన్నది అతని ముఖ్య ఆశయం !

ఈసందర్భంలో వాళ్ల తెలుగు లెక్చరర్‌గారు చెప్పే మాటలు అతనికెప్పుడూ గుర్తుకొస్తుంటాయి .... "మా కాలంలో చదువుకునే కుర్రాళ్లకి, ఉద్యోగస్తులకి — అందరికీకూడా ఎదురుగా ఒక సమస్య కనుపించేది. "ఇంగ్లీషువాళ్లని మన దేశంనుంచి తరిమి స్వరాజ్యం సంపాదించుకోవా" అది. అందువలన ఏమాత్రం ఆవేశంగలవా డయినా ఆలోచన అనేది లేకుండా ఆ సమరం లోకి దూకేవాడు.

"ఇప్పుడు మీతరంవారికి సమస్యలు లేవని చాలామంది ఉద్దేశం. కాని మాకన్న ఎక్కువ ఉన్నాయనిమట్టుకు మర్చిపోకు. అయితే అవి కళ్ళెదుట కనబడవు.— స్పష్టంగా తెలికకూడా కాదు. స్వరాజ్యం సంపాయించడంకన్న అందులోని ప్రతి పౌరుడు దానికి తగిన 'అర్హత' సంపాయించుకోవడం అవసరం. ఇది 'నాది' అన్న భావం కలగాలి ప్రతి వారికి. ఆ భావన కలిగింపచేయటం మీ కర్తవ్యం" అనేవా డాయన.

అందుకనే థర్డుక్లాసులో పాసయినవాడికి అంతకన్న మంచి ఉద్యోగం వస్తుందని ఎందరు చెప్పినా, తనకు తెలిసినా 'గ్రామసేవక్' ఉద్యోగం వచ్చేప్పటికి పరమానందభరితుడయ్యాడు.

"బి. ఏ. ఫస్టున పాసయిన వాడివి ఇదేం ఉద్యోగంరా ? అదీగాక నువ్వు సంపాయించాల్సిన అవసరంమట్టుకు ఏముంది ?" అన్న తండ్రి మాటలు—

"ఒక సంవత్సరంపాటు ఆ వాతావరణం కూడా అనుభవించనీయండి నాన్నగారూ" అని ఆయన ఒప్పుకున్నాకనే బయలుదేరాడు.

ఊళ్ళోకి ప్రవేశించినవాడు అక్కడ రావి చెట్టుక్రింద కూర్చున్నవాళ్ళు తనవంక నిశితంగా చూస్తుండటం గమనించి వాళ్లకు దగ్గరగా వెళ్లి తను వచ్చినవిషయం చెప్పుకున్నాడు.

"ఓహో—డెవలప్‌మెంట్ శంకరం పోయి ఈయన వచ్చినట్టున్నాడురా ! .... ఏం సంతులూ ఏ ఊరు మంది" అనడిగాడు ఒకాయన చుట్టతీసి కైలింజమలా పొగ వదులుతూ.

"పాపం అమాయకులు—అందరి విషయాలు వీళ్లకే కావాలి" అనుకుని తన వివరాలు చెప్పాడు వాసు.

"అయితే ఇంతకీ ఆ శంకరయ్య ఎందుకు పోయాడో తెలుసా ?" అనడిగాడు మళ్ళీ ఆయనే.

ఆయన ఎందుకు పోయిందీ చెప్పకుండానే ఆ పక్కనే ఉన్న కుర్రాడు "ఇప్పు డవన్నీ ఎందుకులే బాబాయ్, ఈయన కొత్తవాడుగా—కరణంగారి కాడికి తీసుకుపోదాం" .... "రండి సార్" అంటూ కర్ర పుచ్చుకొని బయలుదేరాడు.

అతనివెనకనే వెళ్లాడు వాసు.

# దూరపుకొండలు

"పుట్ట పగిలినట్టు వస్తుండారు నా సామిరంగా—ఈళ్లంతా మన్ని ఉద్ధరిస్తారుట. ఆ అమ్మాయి——ఏటీ దానిపేరు .... సినిమాపేరు....ఆ సాయిత్రి—అది ఉద్ధరిస్తోంది చాలదూ మునసబు కొడుకుని, ఈయన ఎవరిని బాగుచేయాలో" అని తుపుక్కున ఉమ్మేశాడు.

అంతా ఘల్లున నవ్వారు.

సాగిపోతున్న వాసుకి ఈ మాటలు వినబడి ఒక్కసారి తెల్లబోయాడు. "ఏమిటి వీళ్ల ఉద్దేశం ?" అనుకుని "ప్చ్ సంస్కారం లేక పాపం" అని సమాధానపడ్డాడు.

కరణంగారిది పెద్ద మండువా లోగిడి. "అయిదారు కుటుంబాలు అవలీలగా ఉండచ్చు ఈ ఇంట్లో" అనుకున్నాడు వాసు చూడంగానే. డబ్బు కూడా దానికి తగినట్టుగానే ఉందాయనకి. మంచి ఆస్తిపరుడు.

వాసు చెప్పిన మాటలు విని—

"పాపం చదువుకున్నవారు—మా ఊళ్ళో ఏం తోస్తుందని ? మా అబ్బాయి ఉన్నాడు. బిఎస్సి అవంగానే మానిపించేశాను వ్యవసాయం చూసేందుకు నాకు సాయంగా ఉంటాడని .... వాడికీ ఏమీ తోచక ఏదో రోడ్లనీ, లైబ్రరీలనీ, చెరువు బాగుచేయించాలనీ అంటుంటాడు. ఊళ్ళో కొందరు కుర్రాళ్లని పోగేసుకుని తిరుగుతాడు..... అరే నాగేశూ, చిన్నబ్బాయిగారిని పిలవరా ! మావాడొచ్చి మీకు అన్ని ఏర్పాట్లు చేస్తాడు. ఈ పక్కగానే మనదే ఒక ఇల్లు ఖాళీగా ఉంది. అందులో ఉందురుగాని .... వెళ్లిపోయిన శంకరయ్యలా కాకుండా తెలివిగలపని చేశారు. నేరుగా—మనింటికి వచ్చేశారు. మరి నే వస్తా అలా పొలం పోయి" అంటూనే వెళ్లిపోయాడాయన.

కూర్చుని ఒక్కసారి చుట్టూ కలయచూశాడ వాసు. ఎక్కడ చూసినా ధనలక్ష్మి కలకల్లాడుతోంది ఆ ఇంట్లో ! ధాన్యపుకొట్లు తాళాలు వేశారు. అవి చాలలేదు కాబోలు పురులున్నాయి ఒక వాలుగుదాకా. కొందరు జీతగాళ్లు తాళ్లు పేనుతున్నారు. చూడ ముచ్చటగా ఉంది వాసు కిదంతా.

"నమస్కారమండి. నాపేరు శర్మ" అంటూ వచ్చాడు కరణంగా రబ్బాయి.

సహారా ఎడారిలో మంచినీళ్ళు కనబడినట్లయింది వాసుకి— అంతమంది మధ్యన తనలాంటి ఒక వ్యక్తిని చూసేసరికి.

"నమస్కారమండి—నా పేరు వాసు ...." అని అతను పూర్తిచేయకుండానే,

" .... మీ విషయం మా పాలేరు చెప్పాడులెండి. నాకూ ఏమీ తోచక బాధపడుతున్నాను. మీలాంటివారు రావడం నిజంగా నా అదృష్టం. "వాసంతీ— వాసంతీ .... " మా అక్కయ్య కూతురులెండి. మా యింట్లోనే ఉంటుంది. పి. యు. సి. పాసయింది. అరే సాంబయ్యా, వసంతమ్మగారిని పిలవరా."

"వచ్చె, వచ్చె—ఎందుకలా గావుకేకలు పెడతావు ? అమ్మమ్మ ఏదో తరగమంటే తరుగుతుంటే గుక్కతిప్పుకోకుండా అరుస్తాడబ్బా" అని నణుగుతూ బయటికి వచ్చి శర్మపక్కన కొత్త మనిషిని చూసి గబుక్కున సిగ్గుపడింది.

"ముందా బుంగమూతి తీసెయ్. ఆఁ కరెక్ట్ ! ఈయనెవరో తెలుసా—వాసుగారని 'విలేజి లెవెల్ వర్కర్.' ఈ అమ్మాయి ఉంది చూశారూ మిస్ వాసంతి. చదువుకి రాజీనామా ఇచ్చి మమ్మల్ని ఉద్ధరిస్తోంది" అని ఫక్కున నవ్వేశాడు !

వాసుకూడా నవ్వాడు. కోపం అంతా పోయి నవ్వుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది వాసంతి.

"మీరీ ఊళ్ళో ఉన్నన్నిరోజులు మీతోపాటు నేనూ ఉంటాను. ఇక్కడ కొంతమంది కుర్రాళ్లని పోగుజేసి "యువజనసంఘం" స్థాపించాను. వాళ్లంతా మనకి సాయంగా ఉంటారు. నాక్కూడా చాలా ఆశయా లున్నాయిలెండి. మా వసంత నాకు ముఖ్యమయిన వాలంటీ రనుకోండి.'

మర్నాడు శర్మ కుర్రాళ్లనందరినీ సమావేశపరిచాడు ఇంటి వరండాలో. శర్మపక్కగా కూర్చుంది వాసంతి.

"ఈయన ఎవరయినదీ, ఎందుకు వచ్చిందీ మనకందరికీ తెలుసు. ఇదివరకటి రోజుల్లో ఊళ్ళో ఏపని చేయాలన్నా గవర్నమెంటువారి చుట్టూ తిరగనన్నా తిరగాలి లేకపోతే మొత్తం ఖర్చు మనమయినా భరించాలిసుండేది. ఇప్పుడు ఈ బ్లాకులవలన ప్రభుత్వంకి మనకి మధ్య ఈ గ్రామసేవకులు రాయబారుల్లాంటివా రయారు. ఏదయినా ఒకపని చేయించాలి అంటే వీళ్ల ద్వారా ప్రభుత్వానికి ఒక విజ్ఞప్తి పంపడంతో పాటు మనంకూడా ఆ ఖర్చులో కొంతభాగం భరించేందుకు సిద్ధపడాలి. ఈ విషయాలు మీకందరికీ తెలిసినవే. అందువలన మనం వీరితో సహకరించి మన ఊరు బాగుచేసుకోవాలి" అన్నాడు శర్మ.

కాగితాలను దీక్షగా చదువుతున్న అఫీసర్ గదిలోనికి అప్పుడే వచ్చిన గుమస్తా వినయంగా ఇలా అన్నాడు.

గుమాస్తా: అయ్యా! నమస్కారమండీ.

ఆఫీసరు-(పరధ్యానంగా) అక్కడ పెట్టవయ్యా! తరువాత చూస్తాను.

అందరికీ నచ్చాయి ఈ మాటలు.

ఇంతలో "నమస్కారమండి వాసుగారు. నేను గ్రామసేవికనండి. నా పేరు సావిత్రి" అంది ఒకమ్మాయి లోపలికి వచ్చి.

సావిత్రి అనగానే ఏదో గుర్తుకొచ్చి ఆమె వంక పరీక్షగా చూశాడు వాసు. సన్నగా నాజూగ్గా అందంగా కడిగినముత్యంలా ఉంది. అందమయిన చేతులు ఇంకా అందంగా జోడించి చిరునవ్వుతో నమస్కరించింది.

అప్రయత్నంగా "నమస్కారమండి" అనేశాడు వాసు.

వాసంతి లేచి "రండి, రండి" అంటూ సావిత్రికి స్వాగతం పలికింది.

కాని ఆమెరాక మిగిలినవా రెవ్వరికీ ఆనందదాయకంగా లేదని గ్రహించాడు వాసు! కొంతసేపు కబుర్లయాక ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఈ అమ్మాయిని ఆ చలపతిగాడు పంపించి ఉంటాడు, మనం మాట్లాడుకునేవి వినేందుకు" అన్నాడు శర్మ ఆమెకూడా వెళ్లిపోయాక.

"చలపతి ఎవరు ?"

"ఉన్నాడులెండి ఒక బేవారుసుడు—మునసబుగారబ్బాయి. ఈవిడగారు ఉండటం వాళ్లింట్లోనే."

" .... ఒక గదిలో. నువ్వెప్పుడూ ఇంతే మావయ్యా. ఆవిడనిగురించి చాలా తేలికగా మాట్లాడతావు. ఒకరినిగురించి అభిప్రాయపడేముందు కొంచెం ఆలోచించుకోవాలి" అంది వసంత.

"ఓయబ్బో ఆవిడని అంటే ఈవిడముఖం చూడండి—ఎలా ఎఱ్ఱపడిందో !" నవ్వాడు శర్మ.

"అదికాదండీ వాసుగారూ, మా మావయ్య చెప్పడుకాబట్టి నేను చెబుతున్నాను. ఈ ఊళ్ళో రెండు పార్టీలండి. ఒకటి మా తాతయ్యది రెండవది మునసబుది. ఊళ్ళో ఎక్కువమంది మా తాతయ్యపార్టీ. మాలపల్లిలో ఎక్కువమంది ఆయనవైపు. మీక్రితం ఉండి వెళ్లిన శంకరంగారు ఇవన్నీ తెలియక రాంగానే మునసబు ఇంటికి వెళ్లాడు. ఆయనింట్లోనే ఒకపక్కగా ఉండేవాడు. దాంతో ఆయన్ని ఊళ్ళోనుంచి వెళ్ళగొట్టేదాకా మా తాతయ్య నిద్దరపోలేదు. ఈ సావిత్రి ఆయన ఉండగా వచ్చింది. పాపం ఆయన ఈవిడనికూడా మునసబుగారింట్లోనే చేర్చాడు. అందువలన సహజంగా ఆవిడనికూడా మావాళ్ళు వెలివేశారు. తీరా ఏడిస్తే మునసబూ, మా తాతయ్యా ఎదటుపడితే ఎంతో ఇదిగా మాట్లాడుకుంటారు.

"అయితే సావిత్రిలో నాకు నచ్చనిదల్లా ఒక్కటండీ—ఆ చలపతికి రౌడీగా పెద్ద పేరుంది ఊళ్ళో. వాడితో ఆవిడ ఎంతో కలుపుగోలుగా తిరుగుతుంది. మరి ఆయనకి భయపడి అలా చేస్తుందేమో !"

"మా మేనకోడలుగారు ఊళ్ళోని రాజకీయాలన్నీ ఎంత సంగ్రహంగా వివరించిందో విన్నారుగా. ఇకపోతే పల్లెటూళ్లతో బాధేవిటంటే ప్రతి పనికీ ఎంత మంచిదయినాసరే ప్రతిఘటన ఉంటుంది. ఒకసారి ఏమయిందనుకున్నారు ....స్వతంత్రం వచ్చిన కొత్తల్లో దేవాలయాల్లోకి హరిజన ప్రవేశం చేయించాలని అన్ని ఊళ్లకి తాఖీదులు పంపించింది గవర్నమెంటు. మా ఊళ్ళో ఆ మహోత్సవం జరిపించేందుకు తాసీల్దారుగారు స్వయంగా వచ్చాడు. సరేనని మా నాన్నగారు మాలపల్లి అంతా సమావేశపరచి "మీరూ, మేమూ ఏకమవాలి కాబట్టి మా దేవాలయంలోకి ప్రవేశించి

అక్కడి భావిలో నీళ్ళు తాగండి" అన్నారు.

అందులో ఒకతను లేచి "మీరూ మేమూ ఒకటవ్వాలంటే దేవాలయాల్లోకి వచ్చి ఏం లాభం అండీ—సంబంధాలు కలుపుగోవాలి గాని" అన్నాడు.

మా నాన్నగారుకూడా నవ్వి "అవునవును" అనేప్పటికి అతను "అయితే కరణంగారూ, చినదొరగారికి మా అమ్మాయి నిస్తాను చేసుకుంటా రండి ? స్కూల్ఫైను పాసయింది. నల్లరూపు వయినా బాగుంటాది" అన్నాడు నవ్వుతూనే.

మా నాన్న మట్టుకు తక్కువ తిన్నాడా "అలాగే చేసుకుందునుగాని — నా మనవరాలు ఒకతి ఉండి పోయిందిరా అబ్బాయి, దాన్ని చేసుకోకపోతే నా కూతురు నా ప్రాణం తీస్తుంది" అన్నాడు అంతా నవ్వేశారు. ఇంతకీ అవ్వాళ గుడిలోకి వెళ్ళేందుకు ఒప్పుకోలేదు. ఆ ప్రశ్న అడిగించింది మునసబుట. కాబట్టి ప్రతిపనికి — మంచిగాని, చెడుగానీ—ఎవరో ఒకరు ఎదిరిస్తారు.

ఈ మాటలన్నీ వింటుంటే పల్లెటూళ్ళ స్వరూపం కొద్దికొద్దిగా అర్థమవుతోంది వాసుకి. ఇక్కడ కూడా వాతావరణం కుళ్ళిపోయిందన్న మాట అని ఆశ్చర్యపోయాడు !

రోజులు గడుస్తున్నాయి.

బ్లాకుద్వారా సెప్టిక్ లెట్రిన్లకోసం పింగాణీ సామాను తెప్పించి ఊళ్ళో అందరికి ఇచ్చాడు వాసు ఊరికినే వస్తున్నాయికాబట్టి పుచ్చుకున్నారు. కాని ఒక్కరుకూడా దాన్ని సద్వినియోగపరచలేదు. పొగలేని పొయ్యిలవలన లాభంలేదని తెలిసికూడా పైవాళ్ళు వాటిని ప్రచారంచేయమని తన్ని పేపుకుతింటుంటే అవి కొన్ని తెప్పించి ఇంటి కొకటి ఇద్దామని ప్రయత్నించాడు. కాని వాటికి డబ్బు కట్టాలని అనడంతో ఎవ్వరూ పుచ్చుకోలేదు. నవ్వుకున్నాడు వాసు.

ఆ ఊరివారు మంచినీళ్ళకోసం పడుతున్న ఇబ్బందిని గమనించి చెరువులో మధ్యగా భావి తీయించి దానికి ఇంజనుపెట్టి పంపులు వేయించే పథకాన్ని తయారుచేయించి వాసు శర్మ కలిసి ఇంటింటికి తిరిగి సంతకాలు చేయించి పైకి పంపించాడు. అది వెంటనే శాంక్షనయింది. తీరా డబ్బు వసూళ్ళదగ్గరికి వచ్చేప్పటికి పేచీ వచ్చింది. మునసబుగారి పార్టీవారు ఇవ్వం— మా కక్కరలే దన్నారు. వారు వేయకుండా మేం డబ్బు వదిలించుకుంటే వారుకూడా అనుభవిస్తారా — టట్ వీల్లేదు. మేమూ ఇవ్వం అన్నారు కరణంగారి పార్టీవారు. కరణంగారు మట్టుకు ముసిముసినవ్వులు నవ్వారు. "కుర్రాళ్ళ వీళ్ళకేం తెలుసు — ఈమాత్రం తలుచుకుంటే మేంమటుకు వేయించలేమా" అన్నట్టుగా.

వాసు ఈ అర్థంలేని పేచీలకి ఎంతో బాధపడ్డాడు. వీరూ, వారూ కలిసి ఊరి ప్రగతికి అడ్డుపడటం అతనికి కష్టం కలిగించింది వెంటనే తానూ ప్లేటు ఫిరాయించి "ఇప్పుడు మీరు స్వయంగా పూనుకుని ఈ కార్యం నెరవేరుస్తే ఆ మునసబుగారు తలెత్తుకోలేడు" అన్నాడు కరణంగారితో రహస్యంగా.

అతనన్న మాట తలకి బాగా ఎక్కినట్టుంది — ఆయన స్వయంగా ఊరిపెద్దలకి కబురుచేసి ముందు డిపాజిట్టు కట్టేందుకు రెండువేలు క్షణాలమీద వసూలుచేశాడు.

మొత్తంమీద వాసుకి కాలం చాలా సరదాగానే గడిచిపోతోంది దానికి కారణం శర్మ, వాసంతి. శర్మ పొలంవెళ్ళిన వేళల్లో కూడా మాగజైన్ల కోసం, నవల్స్ కోసం వచ్చి కూర్చుని ఎన్నో కబుర్లు చెపుతుండేది వాసంతి. కాలేజీల్లో జరిగిన విషయాలు, ఆడపిల్లల వెంటపడే మగపిల్లల వెకిలిచేష్టలు మొదలయినవన్నీ వర్ణిస్తుండేది. ఒకసారి వాళ్ళ క్లాసుమేటువెనక కూర్చుని ఒకబ్బాయి ఆ అమ్మాయి జడ అల్లడం మొదలెట్టాడుట. ఆ విషయం కనిపెట్టి ఆ అమ్మాయి మాస్టరుకి చెప్పకుండా నెమ్మదిగా రెండుచేతులు వెనక్కి పోనిచ్చి అతని చేయి పుచ్చుకుని చర్మం ఊడి వచ్చేట్టు గట్టిగా గిల్లేసిందిట. అరవలేక, ఎవరితో చెప్పుకోలేక నానాయాతనా పడ్డాడుట.

పగలబడి నవ్వా రిద్దరూ. వసంత అమాయకంగా మాట్లాడుతుంటే వాసుకి చిన్నపిల్లల మాటలు వింటున్నట్టు ఉండి ముచ్చట వేసేది. ఒకరోజు—

"మావయ్య పొలం వెళ్ళాడు కుప్పదగ్గిర కాపలాకి. రాత్రికి అక్కడే పడక. అందుకని మావయ్యని చూసినట్లూ ఉంటుంది, అలా షికారు వెళ్ళినట్టు ఉంటుంది — రండి వెడదాం" అంది వాసంతి.

సరేనని బయలుదేరాడు వాసు. ఇద్దరూ కలిసి నడుస్తూంటే దారిలో సావిత్రి ఇల్లు రాంగానే "సావిత్రిగారిదగ్గరకు వెడదామా ?" అని అతని సమాధానంకోసం చూడకుండానే లోపలికిదారితీసింది.

ఒక వడ్రంగి అతిశ్రమ కోర్చి రెండు కర్రబొమ్మలను చెక్కాడు. అందులో ఒకటి మధ్య వయసులో నున్న స్త్రీది, ఇంకొకటి మంచి వయసులోనున్న స్త్రీది. అందంగా తయారైన ఆ బొమ్మలకు ఏం పేర్లు పెట్టాలా, అనే సమస్య ఎదురైంది, అ కాష్టశిల్ప స్రష్టకు. తికమకపడి చివరకు, అత్తా-కోడలు, అనుకున్నాడు. అంతే! రెండు చెక్కబొమ్మలకు ప్రాణాలొచ్చి సిగపట్ల యుద్ధానికి తలపడినాయట. పాపం వడ్రంగి గుడ్లు తెరచి, చూస్తూ ఊరుకున్నాడు.

టి. తారామనోహర్
(హుజూరాబాదు)

సావిత్రిసట్లు ఎటువంటి దురభిప్రాయం లేకపోయినప్పటికీ ఆమెతో ఎక్కువగా మాట్లాడ లేదు వాసు. ఏదో వృత్తిరీత్యా అప్పుడప్పుడు కలుసుకోవడం తప్పిస్తే ఎప్పుడూ ఆమె ఇంటికి వచ్చిందిలేదు.

అనుకోకుండా వచ్చిన ఈ అతిథుల్ని చూసి ఎంతో ఆనందపడి అప్పటికప్పుడు కాఫీ అదీ పెట్టింది సావిత్రి. ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు చీకటిపడేదాకా—

"నేను ఇక్కడ మునసబుగారింట్లో ఉన్నానని కోపంకొద్దీ చాలామంది ఇక్కడకు రారు. ఆడపిల్లలకి కుట్లు నేర్పుతాను రమ్మన్నాను. మిషను కూడా తెప్పించాం—కాని .... ప్చ్ .... ఇద్దరు ముగ్గురు తప్పిస్తే ఎక్కువగా రారు. పల్లెటూళ్ళు ఇంత అధ్వాన్నంగా ఉంటాయని, మనుష్యుల్ని ఇంతగా అపార్థంచేసుకుంటారని అనుకోలేదు నేను చేసిన తప్పల్లా వీళ్ల ఇంట్లో ఒక భాగంలో ఉండటం ! అదికూడా నేను వచ్చేప్పటికి అప్పటి గ్రామసేవక్ శంకరంగారు ఇక్కడ ఉండబట్టి నేనూ ఇక్కడే చేరాను. బయట ఎలా ఉన్నా నాతోమట్టుకు గౌరవంగానే మాట్లాడే చలపతిగారితో చనువుగా మాట్లాడటం రెండవ తప్పు" అని బాధగా అని కాసేపాగి .... "నా గురించి రకరకాల కట్టుకథలు ప్రచారంలో ఉన్నాయని నాకూ తెలుసు. నన్ను అతి నీచంగా చిత్రించి ఉంటారు మీముందు .... హుఁ! నాకూ అనిపిస్తుంటుంది "ఉద్యోగం మానేసి వెళ్ళిపోదాం" అని. కాని నామీద ఆధారపడ్డవాళ్ళు అయిదుగురున్నారు. అమ్మ, ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. నాన్నగారు పెద్దవారు — రోగిష్టి మనిషి. ఆయన మందులకి చాలదు నా జీతం. పాపం కావలసినప్పుడల్లా చలపతిగారు డబ్బుసాయంకూడా చేస్తారు... అందువలన గతిలేక ఎవరెన్నిమాటలన్నా సహిస్తూ పడిఉన్నాను. ఈ ఊరు నుంచి బదిలీ చేయమని అడిగాను. కాని ఆ ఊరుమట్టుకు ఇందుకు భిన్నంగా ఉంటుందని నమ్మకం ఏమిటి ? ఈమాత్రం అయినా బ్రతకనిస్తారని భరోసా ఏముంది ? .... అసలు ఆడది ఒంటరిగా ఉంటేనే భరించదు లోకం. అందులో ఉద్యోగంకూడా చేస్తుంటే .... " ఇక మాట్లాడలేక ముఖాన్ని చేతుల్లో కప్పేసుకుంది.

వాసు నీరయిపోయాడు ఆమె చరిత్ర విని.

వాసంతికండ్లు నీళ్లతో నిండిపోయాయి. "ఛ, ఛ .... ఊరుకో సావిత్రి ! ధైర్యంగా ఎదిరించి నిలబడాలిగాని ఇలా ఏడుస్తారా ఎక్కడయినా ?" అంటూ ఓదార్చిందేగాని తన బుగ్గల మీదుగాకారిపోతున్నకన్నీటిని తాను ఆపుకోలేపోయింది.

"చూశారా, ఇటువంటిదాన్ని పట్టుకుని నానా మాటలూ అని పొడిచి చంపుతున్నారు. పాపం, ఇప్పు డన్నివిషయాలు విడమర్చి చెప్పింది కాబట్టే మనకి నమ్మకం కలిగింది. కాని ఇలా ఎంతమందికని చెప్పుకేడుస్తుంది—వినేదాకా ఓపిక ఎవరికుంది? ఒంటరిగా బ్రతుకుదామని బయలుదేరిన ఆడదాని జీవితం ఇంతే వాసుగారూ" అంది వాసంతి

(43 వ పేజీ చూడండి)

# దూరపు కొండలు

(35 వ పేజీ తరువాయి)

ఇంటికివెళ్ళే దారిలో.

వాసుమనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది. ఇంటికి వెళ్ళేప్పటికి ఎదురుగా శర్మ కూర్చుని ఉన్నాడు పడకకుర్చీలో.

వచ్చేశావేం మావయ్యా — రానన్నావుగా!" అంది వసంత.

అతన్ని ఇంట్లో చూడగానే ఆమెమనస్సు పడిన ఆనందం ముఖంలో ప్రతిబింబించి వాసు నవ్వుకున్నాడు.

కాస్సేపు మాట్లాడకుండా వాళ్ళిద్దరివంక చూసి "అవును వచ్చేశాను" అన్నాడు శర్మ.

అప్పటికే బుర్ర అంతా వేడెక్కిపోయి ఉండటంవలన వాసు తనగదిలోకి వెళ్ళిపోయాడు మాట్లాడకుండా.

వసంత లోపలికి వెడుతుంటే శర్మ కూడా వెడుతూ "పొలంనుంచి వచ్చేప్పటికి నువ్వు, వాసు కలిసి నాకోసం వచ్చారని చెప్పింది అమ్మ. నాకు ఆశ్చర్యం వేసింది! .... బహుశ అలా అంటే ఇంకేమీ అడగదనుకుని అలా అన్నావనుకుంటా!" అన్నాడు శర్మ నవ్వుతూనే ఆమెవంక నిశితంగా చూస్తూ.

"అవును మావయ్యా, నీకోసమే బయలుదేరాం తీరా దారిలో సావిత్రిఇంటికి వెళ్ళాం. పాపం ఆ అమ్మాయి తనవిషయం అంతా చెప్పుకుని ఏడ్చింది. చాలా బీదవాళ్ళట. కుటుంబ పోషణ అంతా ఈ అమ్మాయిమీదనే ఉందిట. "ఊళ్ళోవాళ్ళనేమాటలు విని ఉద్యోగం మానేద్దామంటే తరువాత గడవటం ఎలాగన్న భయం వలన అభిమానం చంపుకుని బతుకుతున్నాను వాసంతిగారు" అని ఏడ్చింది. పాపం జాలేసింది మావయ్యా" అంది వాసంతి.

"సర్లే, నువ్వు మళ్ళీ ఏడవబోకు! అభిమానం చంపుకున్నానందిగా—ఇక ఎటువంటి భయం లేదులే!" అన్నాడు కసిగా.

ఆతనివంక తెల్లబోయి చూసింది వాసంతి!

మొత్తంమీద వసంత వాసుతో చనువుగా ఉండటం, కలిసి తిరగడం ఊరికే పోలేదు. ఊళ్ళో గుసగుసలుగా బయలుదేరి రావిచెట్టు కింద రచ్చబండమీద చర్చలుదాకా పెరిగింది ఈ విషయం. ఒకరిద్దరు చనువుని పురస్కరించుకుని శర్మని హెచ్చరించడంకూడా జరిగింది.

కాని అతనంతగా పట్టించుకోకపోయినా కొంచెం జాగ్రత్తపడటం మంచిదని నిశ్చయించుకున్నాడు. తను లేకపోయినా వాసుతో కలిసి వసంత సావిత్రి ఇంటికి తరుచు వెడుతూండటం అతనికి నచ్చకపోగా వీరి స్నేహానికి సావిత్రి దోహదంచేస్తోందేమోనన్న అనుమానం కలిగింది. కాని—ఈ ఊహాగానాలవెనుక ఎంతవరకు సత్యమున్నదని వసంతని అడగలేకపోయాడు. అసలే చిన్నతనం నుంచి గారాబంగా బస్తీలో పెరిగిన పిల్ల—అందులోనూ చదువుకున్నది. ఏమయినా అంటే ఏడుస్తూ కూర్చోవచ్చు లేకపోతే తనమీద మనస్సు పూర్తిగా విరిగిపోవచ్చు. పైగా తల్లి తండ్రీ చీవాట్లుకూడా వేస్తారు — ముద్దుల మనవరాలు కాబట్టి. అందువలన వాళ్ళమీద ఒక కన్ను వేసి ఉంచటానికి మించి అతను ఏమీ చేయలేకపోయాడు. వాసుతోమట్టుకు చనువుగా మాట్లాడటం మానేశాడు.

సమితి వార్షికోత్సవాలు దగ్గరబస్తీలో జరుగుతాయని, నాటకాలు, పిల్లల ఆటలపోటీలు ఉంటాయి — ఎటూ సావిత్రి కూడా వస్తుంది కాబట్టి వసంతా శర్మా కూడా వస్తే సరదాగా అంతా కలిసి వెళ్ళిరావచ్చని ప్రతిపాదించాడు వాసు.

కాని శర్మమట్టుకు ఒప్పుకోలేదు. తనకేవో అర్జంటుపను లున్నాయన్నాడు. ఇదివరలో వసంత తనులేకుండా ఎప్పుడూ బస్తీ వెళ్ళలేదు వాసుతో. ఇవ్వాళ వెడుతుందా లేదా అన్నది పరీక్షించాలని నిశ్చయించుకున్నాడు అతను.

పల్లెటూళ్ళో ఉండటంవలన విసిగిపోయిన వసంత వెంటనే ఒప్పుకుంది సావిత్రితోపాటు తనూ వచ్చేందుకు. శర్మనికూడా రమ్మని బతిమాలినా అతను మొండికేయడంతో ముగ్గురూ కలిసి వెళ్ళిపోయారు.

శర్మకి ఒళ్ళు భగ్గుమంది. వాసుని నిలువునా చంపేయాలన్నంత కోపం వచ్చింది. అతన్ని అణిచివేసే అవకాశం రాకపోతుందా అని సమాధానపరుచుకొన్నాడు మనస్సుని.

బస్తీకి సినిమాచూసేందుకు వచ్చిన చలపతి కనిపించి వాళ్ళతోపాటు తనుకూడా నాటకాలు చూసి నలుగురూ కలిసి ఒక రాత్రివేళ ఊరు చేరుకున్నారు. వసంతా, వాసు లోపలికి వస్తుంటే రెండు ఎర్రటికండ్లు వాళ్ళని పరీక్షగా చూడటం వాళ్ళకి తెలియదు.

శర్మ తనతో అసలు మాట్లాడటం మానేయడం వాసుకి కష్టంగా ఉంది. ఏమిటి తన దోషం? అని ఆశ్చర్యపోయాడు.

మాలపల్లిలో ప్రస్తుతం ఉంటున్న ఇళ్ళు చాలా ఇరుగ్గా ఉన్నాయని మురుగునీరుతో అనారోగ్యంగా తయారయిందనీ — కొత్తగా ఇండ్లు కట్టుకునే స్థలాలకోసం పక్కనున్న పొలం పూడదోయించి ఇస్తే ఈ ఇరుకుబాధ తప్పి విశాలంగా బ్రతుకుతామని తమకి ఆ సహాయం చేయాలి సిందని అడిగారు వాళ్ళు వాసుని. ఇటువంటి విషయాలు ప్రభుత్వం త్వరగా అమలుపరుస్తుందన్న విషయం తెలిసిన వాసు వాళ్ళు అడిగినప్రకారం ఒక మహజరు రాసి తాసీల్దారుకి పంపించాడు. పంపించాక తెలిసింది అది కరణంగారి పొలం అని.

జరిగినదంతా శర్మకి చెప్పి "మీరూ, నేనూ కలిసి నాన్నగార్ని ఒప్పించాలి అది వాళ్ళ కివ్వేందుకు. గవర్నమెంటు నష్టపరిహారంకూడా ఇస్తుందనుకోండి" అన్నాడు.

"దొరక్క దొరక్క మీకు మా పొలమే దొరకటంలో మీ ఉద్దేశ్యం ఏమిటో?" అన్నాడు కోపంగా శర్మ.

అనుకోని ఈ ప్రశ్నకి ఖంగారుపడిపోయాడు వాసు. "ఉద్దేశం ఏముందండి—ఇది ఊరిచివరన ఉన్నది. దీనికి పక్కగా పెద్ద దిబ్బకూడా ఉంది. పైగా మాలపల్లికి రెండవవైపు చెరువుంది కాబట్టి అటు పెరిగేందుకు వీల్లేదు కదా!" అన్నాడు.

"నష్టపరిహారం ఇస్తారుగా మావయ్యా — మనకేం నష్టం?" అంది వసంత వాళ్ళమాటలువిని.

"అవును మావయ్యా ప్రతివిషయం నీకే కావాలి. మగాళ్ళమాటల్లోకి ఎందుకలా దూరబడతావు? నష్టపరిహారం ఏ రేటున ఇస్తారో నీకేమయినా తెలుసా? ఆ చుట్టుపక్కల క్రయమయినపొలం రేటున. మనవాళ్ళు పొలాలు కొనేప్పుడు అసలు ఖరీదులో నాలుగోవంతుకూడా దస్తావేజులో రాయరు — స్టాంపు ఖర్చు తగ్గుతుందని. మరి ఆనష్టం నువ్విస్తావా, ఆయనిస్తాడా?" అనడిగాడు కోపంగా.

ఇద్దరూ తెల్లపోయారు అతనిలోని ఈ మార్పుకి.

"ఈమధ్య మీరు కొంచెం విసుగ్గా ఉంటున్నారు శర్మగారూ" అన్నాడు వాసు బాధగా.

"అవునవును చేసినవాటికి పశ్చాత్తాపపడుతున్నాను" అని విస్సురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

వసంత ముఖంవంక అయోమయంగా చూసి వీధిలోకి వెళ్ళిపోయాడు వాసు. కొన్నిరోజులుగా శర్మ ప్రవర్తన వాసుకి చాలా బాధ కలిగిస్తోంది. తనతో మాట్లాడటం పూర్తిగా మానేశాడు. తన మాటంటేనే మండిపడుతున్నాడు. ఏమిటి తను చేసిన నేరం? ఒకవేళ పొలం మాలపల్లి కింద ఇవ్వమని మహజరు పెట్టించినందుకా? అది కేవలం వాళ్ళ కోరికమీదనే జరిగింది—తను రాయకపోతే మరొకరిచేత రాయించుకునేవాళ్ళు. గవర్నమెంటు ఆసామికి ఇష్టమున్నా, లేకపోయినా, బలవంతంగానయినా లాక్కుంటారు. మధ్య తనమీద కోపమెందుకు?

ఈ విచారంలోనే తనిన్ని రోజులుగా పట్టించుకోని విషయం మరోవిషయం కూడా స్ఫురించింది అతనికి. ఊళ్ళో వాళ్ళుకూడా ఇదివరకటిలా గౌరవంగా మాట్లాడటం మానేశారన్నది— ఏదో దొంగని, రౌడీని చూసినట్లు చూస్తున్నారన్నది. ఏమిటి దీని కంతకూ కారణం? ఎందుకు తనవెనక నవ్వుకుని వాళ్ళు ఆనందిస్తున్నారు.

ఆలోచించుకుంటూ పొలాల్లో రాత్రి బాగా

ఒక ఆఫీసరు చికాకుతో తన గుమస్తాతో యిలా అన్నాడు:

ఆ ఫైలు తెచ్చి యిక్కడ తగలెట్టు.

గుమస్తా: దయచేసి కొద్దిగా అగ్గిపెట్టె యివ్వండి సార్!

షేక్ మాలా సాహెబు
(గిద్దలూరు)



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యాసుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్‌ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేనయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City






**అతి త్వరలో**

కుదుళ్లను బలపరచుటయే గాక, మనోహరమైన విడుపాటి వల్లని శిరోజములను పెంపొందించును. దీనిలో చేర్చిన ఔషధి సంపతివల్ల కేశములు ఊడిపోకుండగను, చుండ్రు లేకుండగను, నెరవకుండగను రీటా కాపాడగలదు.

రీటాను కొబ్బరినూనెలోగాని, మంచినూనెలో గాని కలిపి నిత్యం వాడండి. తప్పకుండా మీ కేశములు నల్లబడతాయి. దీనిని మీరు వాడి, మీ స్నేహితులకు కూడ సిఫార్సు చేయండి.

**రీటా**

అందమైన కేశ సంపదకు

పీటో కంపెనీ,
మద్రాసు-1

R-5TG


## దూరపు కొండలు

అలస్యమయేదాకా ఉండిపోయాడు. ఒకరకమైన నిస్పృహ, నిరుత్సాహం ఆవరించుకుంది అతని మనస్సుని. ఇక తనా ఊళ్లో ఉండటంలో అర్థం కనబడలే దతనికి. "హాయిగా బస్తీలో పడిఉండక ఎందుకు తనకీ బాధ — ఈ మూర్ఖులమధ్య" అనుకున్నాడు.

ఒక నిర్ణయానికి వచ్చి గబుక్కున లేచి నిలబడ్డాడు. చేతిగడియారం పది దాటిందని చూపించింది. గబగబ అడుగులు వేసుకుంటూ ఊళ్లోకి వచ్చాడు. వీధుల్లో ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి. తను ఈ వూరిలో ఉన్న ఆరు నెలల్లో సాధించకలిగినవాటిలో ఈ దీపాలు ఒకటి. అవి పెట్టించేందుకు తనూ, శర్మ కలిసి ఎంత పాటుపడ్డారు. అటువంటి శర్మ ఎందుకిలా మారిపోయాడు ?

సావిత్రి ఇంటిదాకా వచ్చేప్పటికి అప్రయత్నంగా అటువైపు చూశాడు. అప్పుడే తలుపు తీసుకుని ఎవరో లోపలికి వెడుతున్నారు. అనుమానం కలిగి కిటికీకి దగ్గరగా వెళ్లాడు. లోపలనుంచి మాటలు వినబడుతున్నాయి.

"మీరా ?" అంది ఆశ్చర్యంగా సావిత్రి.

"అవును నేనే" వెకిలిగా నవ్వాడు చలపతి.

"ఇంత రాత్రిపూట వచ్చారు—ఏమయినా పనుందా ?" బెరుగ్గా అడిగింది సావిత్రి.

"ఆడదానితో మగాడికి ఇంకా ఏం పనుంటుంది" అంటూ దగ్గరగా పోబోయాడు

"ఛీ, ఛీ ఏం మాటలవి – అటువంటిదాన్ని కాదని ఇదివరకే చెప్పాను మీకు. దూరంగా పొండి" ఖంగారుగా అంటూ వెనక్కి వెళ్లింది.

"ఎటువంటిదానివో మరి ? నా దగ్గర డబ్బు పుచ్చుకున్నావు — నాతోపాటు తిరిగావు. ఊరంతా నువ్వు ఎటువంటిదానివో తెలుసుకుంది. ఇంకా భయం దేనికి ?" అంటూ బలవంతంగా ఆమె చేయి పుచ్చుకున్నాడు.

"వదలండి, వదలండి—మంచిగా మాట్లాడుతుంటే మంచివా రనుకున్నాను. ఇంత నీచానికి వడిగడతా రనుకోలేదు ! వదులుతారా అరిచి గోల చేయమంటారా ?" గొంతులో నిస్పృహతో కూడిన కోపం కనుపించింది. చలపతి చలించక పోగా బిగ్గరగా నవ్వాడు. "అరుస్తావా— అరు. నువ్వు అరిచినా నమ్మేవారు లేరు ఈ ఊళ్లో ! నువ్వు నా కేనాడో లొంగిపోయావని వాళ్ల ఉద్దేశం. ఇవ్వాళ నీ అరుపులు వింటే 'ఇన్నాళ్ల ఇష్టమయి ఒప్పుకుంది — ఇప్పుడేదో డబ్బుదగ్గర పేచీ వచ్చినట్లుంది. అరుస్తోంది" అని నవ్వుకుంటారు."

"ఒదులు, ఒదులు .... " అంటూ ఏడుపు మొదలెట్టింది సావిత్రి.

ఇక ఆగలేకపోయాడు వాసు. అందుబాటులో ఉన్న రాయి పుచ్చుకుని ఒక్క ఊపున తలుపులు తోసుకుని లోపలికి దూకాడు. "వదుల్తావా — తల బద్దలు కొట్టమంటావా ?" అని అరిచాడు.

వాసు రౌద్రాకారం చూసి బెదిరిపోయి అడుగు

వెనక్కివేశాడు చలపతి. కుప్పగా కూలబడిపోయి చేతుల్తో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది సావిత్రి.

"పో బయటికి" గద్దించాడు వాసు.

"నా డబ్బియ్యమను పోతా" అన్నాడు భయం గానే.

"ఎంతివ్వాలి ?"

"రెండు వందలు."

"నే నిస్తాను. తీసుకుపో" అని జేబులోంచి తీసిచ్చి "నడు బయటికి" అన్నాడు.

బుసలుకొట్టుకుంటూ పోయాడు చలపతి.

సావిత్రివంక చూశాడు వాసు. ముడుచుకు పోయి గుండె లవిసిపోయేట్టు ఏడుస్తోంది. అతని మనస్సు కరిగిపోయింది.

"సావిత్రీ — ఆడది ధైర్యంగా ఉద్యోగం చేసే రోజులు రాలేదింకా మన దౌర్భాగ్యపుదేశంలో. అందులో ఈ దరిద్రపు పల్లెటూళ్లలో అసలు లాభంలేదు .... తెల్లవారుఝామున బండికి అన్నీ సర్దుకో. నేను కూడా ఈ వూరితో తెగతెంపులు చేసుకుంటున్నాను. కలిసి వెళ్లిపోదాం — ఈ కుళ్లిపోయిన వాతావరణం నుంచి— ఈ మూర్ఖుల మధ్యనుంచి దూరంగా పోవాలి ! తరువాతి విషయం దారిలో ఆలోచిద్దాం — వస్తావా ?"

వస్తా నన్నట్టుగా తల తిప్పింది సావిత్రి.

"గడియపెట్టుకు పడుకో — ఎవరు పిలిచినా తీయకు. తీసేముందు కిటికీలోంచి ముఖం చూసి మరీ తీయి ! సరిగా మూడింటికి వస్తాను" అని వెళ్ళిపోయాడు. దారిలో ఒంటెద్దుబండి వాడితో "కొంచెం వనుండి ఇంటికి వెడుతున్నాను అయిదు గంటల బండికి కట్టాలని" చెప్పి గదికి జేరుకున్నాడు.

అతని మనస్సంతా కుత కుతలాడిపోతోంది. పడుకున్నాడన్నమాటే గాని నిద్రమట్టుకు పట్టలేదు. రాత్రి రెండయింది. వీధితలుపు ఎవరో తడితే లేచి వెళ్లి తలుపు తీశాడు. నలుగురు జమాజట్టీల్లాంటి వస్తాదులు కర్రలు పుచ్చుకుని లోపలికి వచ్చారు.

అందులో ఒకడు ముందుకొచ్చి వాసు చొక్కాకాలరు గట్టిగా మెలిపెట్టి పట్టుకుని "ఏం పంతులూ, కరణం అండ ఉందని మహా మిడిసిపడుతున్నావు. ఇక అదికూడా పోయింది మాలపల్లిమహిమవలన. ఇక ఏం చూసుకుని ఎగిరావోయ్ మా చలపతయ్యమీద. ఆయన్ని ఎదిరించి నిలిచే మగాడివేనా అంట ! తెల్లారేసరికి ఈ పొలిమేరన కనబడ్డావా సున్నంలోకి ఎముక దొరకదు కాసుకో—దేముడొచ్చినా అడ్డు పడలేడు !' అన్నాడు.

"ముందు నామీద నుంచి చేయి తీయి .... నేనే ఇవ్వాళ వెళ్లిపోదా మనుకుంటున్నాను. తెల్లవారాక మొదటిబస్సుకు వెడతాను అని చెప్పండి; కావాలంటే ఆయన్ని వచ్చి చూడమనండి నేను బస్సు ఎక్కడం. మీరుమట్టుకు మీ తోటి మనిషిని చంపేందుకు ఎప్పుడూ ఇలా రాకండి. ఇక మీరు వెళ్లండి" అన్నాడు వాసు చలించకుండా.

వాళ్ళు కొంచెం ఆశ్చర్యపోయారు—ఇటువంటి కనులకి వాసు పోయినప్పుడు సాధారణంగా అవ


కుటుంబ నియంత్రణం
గర్భనిరోధానికి
స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పైక్ టేబ్లెట్స్ (రిజిష్టర్డ్) గర్భము రాకుండేందుకు తేలికగానోటిలో వేసుకొని మింగే మందు 12 రోజులు ముందు వాడిన యెడల గర్భధారణ కాకుండా చేయును.
పూర్తికోర్సు పాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి.పి. అదనము
ప్రతిచోట దొరుకును
ఇండియాలోను, విదేశాలలోను ఈ మందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రము లను పంపియున్నారు...


SEENU & CO.,
28, K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: ORCAS, (ESTD 1946), PHONE 55357.
(ADVT. PERMITTED UNDER G.O. MS. NO. 1181 HEALTH)

PAKCO పాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు
—: ప్రత్యేక లక్షణములు :—
* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాస్ట్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు


మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :
Grams: LAMP K. S. SHIVJI & CO, (Estd 1903)
Phone: 3617 పోస్టుబాక్స్ నెం. 8, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1

అజీర్ణం,
ఆకలి లేకపోవడం మున్నగునవి
పిల్లలలో, అందులోనూ ప్రత్యేకించి ఏడాది మొదలు, మూడేళ్లలోపు పిల్లలలో, ఈ చిహ్నాలు కనిపిస్తే అశ్రద్ధ చేయవద్దు. తల్లిపాలు మార్చి, మరొకటి ప్రారంభించడం, తేలికగా అరగని పదార్థాలు తినిపించడంవల్ల పిల్లలకు వచ్చే ముందు కూడా లివర్ చెడి, వ్యాధికి దారి తీయవచ్చును.
జమ్మివారి లివర్ క్యూర్ మున్నగుమందు లివర్ వ్యాధులు రాకుండా కూడా నిరోధించే టానిక్‌గా పనిచేస్తుంది. లివర్ మామూలుగా పని చేయడానికి ఉపకరిస్తుంది.
మీ బిడ్డ లివర్ పరీక్ష చేయించండి. జమ్మివారి డాక్టర్ మీ సమీపంలోగల పట్టణానికి ప్రతినెలా వస్తారు. ఆయన పర్యటన కార్యక్రమంకోసం వ్రాయండి.

జమ్మివారి
లివర్ క్యూర్
పిల్లల లివర్, ప్లీహ వ్యాధులకు
JV-4
జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్
బ్రాంచీలు : 17/283-హిందీ వీధి, గాంధీనగర్, బకింగ్‌హాంపేటపోస్టు, విజయవాడ-2. * ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ.

# దూరపు కొండలు

తుంది. అటువంటిది ఇతనిపరిస్థితి అందుకు భిన్నంగా ఉండటం చిత్రంగా ఉంది వాళ్లకి.

తలుపువేసి గబగబ సామాను సర్దుకుని శర్మ పేరిట ఒక ఉత్తరం—చెప్పకుండా వెడుతున్నందుకు క్షమించమని, వసంతకి, శర్మకి వివాహంకి శుభలేఖ తప్పక పంపమని—రాసిపెట్టాడు. ఈ పనులన్నీ అయ్యేప్పటికి మూడయింది. హోల్డాల్ పుచ్చుకుని బయలుదేరాడు.

ఎన్ని ఆశలతో, ఆశయాలతో వచ్చాడు తను ఈ ఊరు. ఇప్పుడు ఏ పరిస్థితుల్లో వదిలి వెళ్ళిపోతున్నాడు ? రేపు తను వెళ్లిపోయినందుకు విచారపడేవారు ఉండరు .... బహుశః వసంత బాధపడుతుందేమో ! .... పాపం అమాయకురాలు. ఆమెని చూస్తే ఎందుకో తనకి తన చిన్నతనంలోనే పోయిన చెల్లెలు గుర్తుకువస్తుంది.

ఆలోచనల్లోనే సావిత్రిఇంటికి వచ్చేశాడు. సావిత్రి కూడా సిద్ధంగా కూర్చునుంది—అతని కోసమే ఎదురుచూస్తూ. ఆమె ఇంటివద్ద చలపతి ఎవరినైనా కాపలా ఉంచుతాడేమోనని భయపడ్డాడు వాసు మొదట. ఆమెసామాను తను కూడా కొంత పుచ్చుకొని "బయల్దేరు సావిత్రీ" అన్నాడు.

ఒక్కసారి వెనక్కి చూసి బావురుమని ఏడ్చింది సావిత్రి.

వాసుకళ్లుకూడా చెమ్మగిల్లాయి. అంతలోనే సర్దుకుని "ఎందుకండీ ఏడుస్తారు? మన అవస్థకి మనం ఏడవాలిసిందేకాని మనకోసం బాధపడేవారెవరూ లేరు ఈ ఊళ్ళో ! పోదాం పదండి" అని ఆమెబుజంమీద చేయివేసి నడిపించుకుంటూ ఊరి బయటికి తీసుకొచ్చాడు. అక్కడ వంటెద్దు బండిఅతన్ని లేపి బండి ఎక్కి కూర్చున్నారు. అంతవరకు ఏ అవాంతరం రానందుకు దేవుడికి మనస్సులోనే నమస్కరించాడు వాసు. ఆ చీకటిలో గంట మోగించుకుంటూ సాగిపోయింది బండి.

స్టేషనుకి వెళ్లేప్పటికి రైళ్లవేళలు మారాయని తెల్లారి అయిదుగంటలకి మొదటి బండి అన్నారు. మాట్లాడేందుకు ఇద్దరి మనస్సులూ బరువెక్కి ఉన్నాయి బండివాడితో మట్టుకు—"వాసుబాబు సావిత్రమ్మని లేవదీసుకుపోయాడని చెప్పుకుని సంతోషపడరా అబ్బీ !" అని చెప్పాడు వాసు.

అందులోని భావం వాడికి అర్థంకాక "అలాగేనండి బాబు" అని దణ్ణంపెట్టి వెళ్లిపోయాడు.

రైలు వచ్చే వేళయింది.

ఇంతలో హడావుడిగా బండిమీద శర్మ, వసంత కలిసి వచ్చారు. వస్తూనే "వాసుగారూ, నన్ను క్షమించాలండి. మిమ్మల్ని అపార్థం చేసుకుని ఇబ్బందిపెట్టాను" అన్నాడు శర్మ.

వాసుకేమీ అర్థంకాక వాసంతివంక చూశాడు.

ఆ అమ్మాయి నవ్వుతూ—"మా పాలేరు ఒకడు రెండవ ఆటకి వెళ్లి వస్తుంటే మీ బండి ఎదురయిందిట. వాడొచ్చి మమ్మల్ని లేపి చెప్పాడు "ఇద్దరూ బండిలో పోతున్నారు. సావిత్రమ్మ ఏడుస్తుంటే ఆయన ఓదారుస్తున్నాడని."

నా కాశ్చర్యమేసి "ఏవిటి మావయ్యా ఇదంతా" అని అడిగాను. అంతక్రితమే పాలేరుద్వారా సావిత్రికి జరిగిన అవమానం, ఆమెని మీరు రక్షించడం, మిమ్మల్ని చలపతి మనుష్యులు బెదిరించడం—అన్నీ విన్నాడుట మావయ్య "పోనీ వెధవ పీడ వదిలింది" అన్నాడు," అని చెప్పి పకపక నవ్వి ఇంతకీ ఈయన కోపానికి కారణం ఏమిటో తెలుసా ? — చెప్పమంటావా మావయ్యా" అంది నవ్వుతూ వసంత.

"నేనే చెపుతాను. అదికాదు మిస్టర్ వాసు, నువ్వు వాసంతి కలిసి తిరిగేప్పటికి అపార్థం చేసుకున్నాను. నువ్వు ఊళ్ళోంచి పోతే పీడ విరగడయిపోయిందని చెప్పి — అన్నీ తెలిసీకూడా కల్పించుకోలేదు ! తీరా ఇందాక చెప్పింది వాసంతి —మీరు సావిత్రిని పెళ్లిచేసుకోబోతున్నారని. సరే—అపోహలన్నీ పోయిన సినిమా హీరోలాగా ఆఘమేఘాలమీద పరుగెత్తించాను బండీని. మీ వివాహానికి నిన్ను అభినందిస్తున్నాను వాసు" అన్నాడు నవ్వుతూ.

వాసు సావిత్రివంక చూశాడు సాభిప్రాయంగా ! ఇంతవరకు ఆమెను ఈ విషయం ఎలా అడగటమా అని తటపటాయిస్తున్నాడు. అసలు ఆమెను వాసు చేసుకోవాలన్న ప్రతిపాదన వసంతది.

సావిత్రి సిగ్గుపడి తల వంచుకుంది. "మేం చాలా బీదవాళ్లం వాసుగారూ" అంది మెల్లిగా.

"బుద్ధిలోమట్టుకు గొప్పవారు" అన్నాడు శర్మ.

"పదండి ఇంటికి వెడదాం. భోజనాలయాక అందరం కలిసి సావిత్రివాళ్ల ఊరు వెళ్లటం, అక్కడినుంచి వాసుగారి ఊరికి ఆపైన మంగళం మహత్ శ్రీ శ్రీ శ్రీ" అని ఫక్కున నవ్వింది వాసంతి.

"మరి మనం చందన తాంబూలాలెప్పుడో ?" అడిగాడు శర్మ.

"పోవోయ్, నిన్ను నేను చేసుకుంటానేమిటి ?" చిలిపిగా నవ్వుతూ అంది వాసంతి.

"అసలు పుట్టడమే అందుకు పుట్టింది కానీ" అని కలిపింది సావిత్రి.

నలుగురూ నవ్వారు.

"శర్మగారూ, మొత్తానికి నాకున్న కొన్ని భ్రమలు తొలిగాయి. ఒక నగ్నసత్యాన్ని గుర్తించాను—పల్లెలు పట్నాలకి తీసిపోవని ! పదండి పోదాం" అని సావిత్రిచేయి పుచ్చుకుని ఊరివైపుకు నడిచాడు వారి పక్కనే వాసంతీ, శర్మ కూడా బయల్దేరారు.

ఆకాశం అంతా ఎరుపు చేస్తూ సూర్యుడు ఉదయిస్తున్నాడు ★

---

# అగ్గిబరాటా

(27-పేజీ తరువాయి)

మనసారా ప్రేమిస్తున్నా—ఇది చదివితే అంతా అర్థమవుతుంది."

ఉషకు కోపం వచ్చింది. చుట్టుప్రక్కలు మరచింది.

"ఏమిటి? ప్రేమలేఖ" కవరుచించి చూచింది. ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది. ఆ ముక్కల్ని గుర్నాధం ముఖంమీద కొట్టింది. ఈ హఠాత్పరిణామానికి కిటికీ దగ్గర మిత్రులిద్దరూ తెల్లబోయారు.

గుర్నాధం తల నరికినట్టయింది!

"ఉషా!"

"వెళ్ళిపో! నాముందు నిలవకు. క్షణంలో నా చెయ్యి కూడా వాడవలసి వస్తుంది పో " అరిచింది. గేటు తలుపు ముఖాన్న కొట్టినట్టు గట్టిగా కొట్టి లోనికి వెళ్ళింది.

గుర్నాధం అవమానభారంతో వెళ్ళిపోయాడు.

"అమ్మబాబో ! అగ్గిబరాటాని వుత్తినే అనలేదురా పారూ!" కిటికీదగ్గర మిత్రులిద్దరూ యిప్పుడిప్పుడే తేరుకొంటున్నారు.

"మరిదేవిట్రా మొదట్నుంచి అభిమానిస్తూన్న గుర్నాధాన్ని హడలు గొట్టేసింది" పార్వతీశం అడిగాడు.

"నువ్వే అన్నావుగా ఆడాళ్ళ అర్థం కారని" నవ్వాడు రామ్మూర్తి.

కొన్ని నిమిషాలు జరిగాయో లేదో బయట తలుపు చప్పుడయింది. పార్వతీశం తలుపుతీశాడు.

ఉషాదేవి ఉరఫ్ అగ్గిబరాటా !!

ఇద్దరబ్బాయిలు చెంపలు సరిచూచుకొన్నారు.

ఉష యింకా భద్రకాళీ రూపంలోనే వుంది.

"చూశారా! గుర్నాధం నాకు ప్రేమలేఖ నిచ్చాడు. కులాసాకోసం కలిసి తిరిగితే యింత వరకూ వచ్చాడు. వెధవ మనుషులు. అవతలివాళ్ళ నర్థం చేసుకోలేరు. ఏవిటి మీ ఉద్దేశ్యం ? ఖబడ్దార్! మీరిటువంటి పిచ్చిపనులు ముందు ముందు చేశారంటే మీకూ యిదే శాస్తి జరిగితీరుతుంది."

ఉష యింకా చెపుతుంది.

"ఈ విషయం ప్రిన్సిపాల్‌కు రిపోర్టుచేస్తే యేమవుతాడు పూర్ ఫెలో! కామన్సెన్స్ బొత్తిగా లేని జంతువు. సారీ! నే నొచ్చిన సంగతి మరచి ఆవేశంలో యేదో చెపుతూన్నా—రేపు సెవెంటీంతు నా మేరేజి వీలైతే మీరూ రండి" అంటూ శుభలేఖ లిచ్చి జారుకుంది ఉష.

"ఓర్నాయనో!" గుండె బాదుకొని మంచి నీళ్ళు తాగాడు రామ్మూర్తి రాత్రి రాసిన లెటరు చాటుగా గుట్టుగా చించిపారేశాడు పారు!

"అయినా యిటువంటమ్మాయిల్ని పెళ్ళి చేసుకొని జీవితంలో సుఖపడ్డమనేది కల్లరా మూర్తీ" అందని ద్రాక్షపళ్ళు చేదనిపించాయి.

"రేపే మనం పాత గదికి పోదాం" ఇంత హఠాత్తుగా మారిపోయిన పార్వతీశాన్ని చూస్తూ రామ్మూర్తి మనసారా నవ్వుకొన్నాడు. ★